## క్లుప్తంగా

### కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవుతున్న పాఠశాల



మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

**మొగల్తూరు:** కొద్దిపాటి వర్షానికే వర్షపు నీరు పాఠశాల ఆవరణలో నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి 63.2 మిల్లీమీటర్ల వర్షానికి, శుక్రవారం కురిసిన 13.2 మిల్లీమీటర్ల వర్షానికి పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచింది. మరి కొద్దిపాటి వర్షం కురిస్తే పాఠశాల ఆవరణతో పాటు పాత తరగతి గదుల్లోకి నీరు చేరుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు సహకరించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### గవర కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యనారాయణ రాజీనామా



బొడ్డేటి సూర్యనారాయణ

**పాలకొల్లు అర్బన్:** మండలంలోని గవరపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బీసీ కమిషనర్‌కి తన రాజీనామా లేఖను పంపినట్లు ఆయన శనివారం తెలిపారు.

### రామోజీరావు మృతికి సంతాపం



వడలిలో రామోజీ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు

**పెనుగొండ:** పద్మవిభూషణ్ రామోజీరావు మృతికి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పెనుగొండ, వడలి, ఆచంట మండలం కొడమంచిలిలో రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### మావుళ్లమ్మ జ్యేష్ఠమాస జాతర ప్రారంభం

**భీమవరం(ప్రకాశం చౌక్):** శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠమాస జాతర మహోత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసాదుల నృత్యాలు, సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి జాతర మహోత్సవాలు మొదటి రోజు వైభోగంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు, అర్చకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

### బీవీ రాజుకు ఘన నివాళి

**భీమవరం:** పట్టణంలోని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ బీవీ రాజు వర్ధంతి సందర్భంగా శనివారం భీమవరం పరిసర గ్రామాల్లో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలోని బీవీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని లెప్రసీ సెంటర్‌లోని లెప్రసీ, ఎయిడ్స్, టీబీ రోగులకు రూ.50 విలువైన మందులు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. అలాగే సెయింట్ మేరీస్ హాస్టల్ విద్యార్థులకు పండ్లు, రొట్టెలు, 7వ వార్డు లెప్రసీకాలనీలో 112 మంది రోగులకు నిత్యావసరాలు, పండ్లు అందించారు. బీవీ రాజు క్యాంపస్‌లో పనిచేసే కార్మికులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కళాశాల డైరెక్టర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

### టీడీపీ అభిమానుల విజయోత్సవ సంబరాలు



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణంలో టీడీపీ నాయకులు విజయోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. స్థానిక 22వ వార్డులో శనివారం మాజీ కౌన్సిలర్ వట్టం గణేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ నిమ్మల రామానాయుడికి నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ, పకీర్ బాబు, జె.రాంబాబు, బి.శేఖర్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# మడ అడవులు కనుమరుగు

- ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను అడ్డుకునేందుకు దోహదం
- తీరం వెంబడి పెరిగిన ఆక్వా సాగు



కాళీపట్నంలో ఆక్వా చెరువులుగా మారిన మడ అడవుల ప్రాంతం



మొగల్తూరు గుంట పల్లవపాలెంలో చెట్లు

**మొగల్తూరు:** సహజ సిద్ధంగా ఏర్పడి తీర ప్రాంతాన్ని, ప్రజలను, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించే మడ అడవులు కనమరుగవుతున్నాయి. వీటినే నీటిపై తేలియాడే అడవులుగా వీటిని పిలుస్తారు. కేవలం మొగల్తూరులోని గుంటపల్లిపాలెం వెళ్లే రోడ్డులో ఓ పది చెట్లే రాబోయే తరాలకు సజీవ సాక్ష్యంగా నిలిచాయి. తమ స్వార్థం కోసం కొందరు సుమారు మూడు దశాబ్దాల నుంచి మడ అడవులను నరికి ఆ ప్రాంతాలను చేపలు, రొయ్యల చెరువులుగా మార్చేశారు. గతంలో రవాణా సౌకర్యం లేని రోజుల్లో మొగల్తూరు నుంచి పాతపాడు వరకు లాంచీ ద్వారా ప్రయాణించే రోజుల్లో ఎక్కడ చూసినా మడ అడవులే దర్శనమిచ్చేవి. ప్రస్తుతం మడ అడవుల స్థానంలో చేపలు, రొయ్యల చెరువులు కనిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను, గాలి తీవ్రతను తగ్గించి, వరదలను, సునామీలను మడ అడవులు అడ్డుకుంటాయి. గతంలో మొగల్తూరు, ముత్యాలపల్లి, చింతరేవు, పాతపాడు, కాళీపట్నం గ్రామాల్లో ఉప్పుటేర్ల వెంబడి మడ అడవులు ఉండేవి. సుమారు 1,500 వందల నుంచి 2వేల ఎకరాల విస్తీర్ణంలో ఉండే మడ అడవులు ప్రస్తుతం ఎకరా భూమిలో కూడా లేవు.

**మాంగ్రోవ్స్‌గా పిలవబడే మడ అడవులు**

మాంగ్రోవ్స్‌గా పిలువబడే మడ అడవులు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా కోరంగి అభయారణ్యంలో మాత్రమే ఉన్నాయి. మన రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు కూతవేటు దూరంలో ఉన్న కోరింగి మడ అడవులు దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందాయి. పశ్చిమ బెంగాల్‌లోని సుందర్బన్ మడ అడవులు ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవులుగా గుర్తింపు పొందాయి. కోరింగి అడవిలో సుమారు 140 రకాల మత్యజాతులు సంచరిస్తాయని అధికారుల అంచనా. అంతే కాక ప్రపంచంలో ఎక్కడా లేని సోనరిటా అల్బా (కళింగ), స్కైఫి ఫోరా (నారా తండుగ) హైడ్రోఫైలీసియా , సైలోకార్పస్ మొలు సెన్సిస్ (సెనుగ) రకాల మత్స్య సంపద కోరింగిలో తప్ప మరెక్కడా కనిపించవని అధికారులు చెబుతుండేవారు. సునామీ, ఉప్పెనలాంటి ఉపద్రవాల నుంచి తీర ప్రాంతాన్ని కంటికి రెప్పలా కాపాడే మడ అడవులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**మడ అడవులను పెంచే ప్రతిపాదన ఏమీ లేదు**

మొగల్తూరు మండలంలో మడ అడవులను పెంచే ప్రతిపాదన ఏమీ లేదు. మడ అడవులు సోషల్ ఫారెస్టుకు సంబంధించినది కాదు, పూర్తిగా వైల్డ్ లైఫ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిందని అధికారులు తెలిపారు.

#### గ్రామాల్లోకి నీరు రాకుండా అడ్డుకునేవి



మా గ్రామంలో యనమదుర్రు డ్రెయిన్‌కు ఇరువైపులా గతంలో మడ అడవులు ఉండేవి. డ్రెయిన్లు పొంగినా, ఉప్పు టేర్లు పొంగినా గ్రామంలోకి నీరు వచ్చేది కాదు. మడ అడవుల స్థానంలో ఆక్వా చెరువులు రావడంతో గ్రామంలోకి నీరు వచ్చి చేరుతోంది.

– రామాని మహేష్, పాతపాడు

#### మత్స్యసంపద తగ్గింది



మడ అడవులు అంతరించి పోవడంతో సహజ సిద్ధంగా పెరిగే రామలు (ఒక రకమైన చేప) లాంటి మత్స్యసంపద తగ్గింది. ఉప్పుటేరు కయ్యల్లోనూ మడ అడవుల్లోనూ పెరిగే రామలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ప్రస్తుతం రొయ్యల సీడ్ లాగ రామలు సీడ్ తీసుకువచ్చి కృత్రిమంగా పెంచుతున్నారు.

– పడవల సత్యనారాయణ, సర్పంచ్, కొత్తోట

#### మడ అడవులు పెంచాలి



మడ అడవులు ఉంటే వరదలు, సునామీ వంటి వాటి నుంచి తీరాన్ని రక్షించుకోవచ్చు. ఇప్పుడు మడ అడవులు నరికివేయడంతో తీర ప్రాంతం ప్రమాదంలో పడింది.తీరం వెంబడి మడచెట్లు పెంచడానికి అధికారులు చొరవ తీసుకోవాలి.

– అంగ్రాజు షరాబంద్ రాజు, కాళీపట్నం

### నరసాపురంలో వదలని వాన

**నరసాపురం:** నరసాపురంలో శనివారం స్వల్పంగా వర్షం కురిసింది. మండలంలో 3.5 మి.మీ, మొగల్తూరు మండలంలో అత్యధికంగా 12.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మూడురోజులుగా వర్షాల కారణంగా వాతావరణం చల్లబడింది. తీవ్ర ఎండల ప్రభావం దీంతో పూర్తిగా తగ్గింది.

### కాపులకొడప వెంకన్నకు మామిడి పండ్లతో అలంకరణ



మామిడిపండ్ల అలంకరణలో వేంకటేశ్వర స్వామి

**నరసాపురం రూరల్:** మేములదీవి గ్రామం కాపుల కొడపలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామిని శనివారం మామిడి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి కెక్కడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించి పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ పదవికి రాజీనామా



రాజీనామా చేసిన ఆసుపత్రి డైరెక్టర్ విజయ్

**పాలకొల్లు సెంట్రల్:** పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ పదవికి చెన్ను విజయ వెంకట నాగభూషణం రాజీనామా చేశారు. శనివారం ఆసుపత్రి ఆర్ ఎంఓకు రాజీనామా పత్రం అందజేసినట్లు విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండేళ్లుగా ఆసుపత్రి డైరెక్టర్‌గా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జగనన్న ప్రభుత్వం అందించిన సహకారంతో పాటు దాతల సహకారంతో ఆసుపత్రిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ఆసుపత్రిలో మహిళలు బాలింతలకు వేడినీళ్ల అవసరమైతే ఆసుపత్రి ఆవరణలో పొయ్యిలపై నీళ్ల కాచుకునేవారని తెలిపారు. వారి సమస్యలను గుర్తించి ఆసుపత్రి వార్డుల్లో వాటర్ గీజర్లు, తాగేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన దాతలకు, వైద్యులకు, సిబ్బందికి, నర్సింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి కృపానాథ్, పిల్లా అప్పాజి, ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి



పెనుగొండలో ఉపాధి కూలీలతో సంఘ నాయకులు

**పెనుగొండ:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేతనాలు పెంచుతూ రోజుకు రూ.300 చెల్లిస్తానన్న హామీ ఆచరణకు నోచుకోవడం లేదని, సత్వరం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శనివారం మునమర్రు రోడ్డులో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలకు రూ.250 నుంచి రూ.270 వరకూ మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాని కోరారు. క్షేత్ర స్థాయిలో పనులను అధికారులు సందర్శించి కూలీల బాధలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సీనియర్ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం



లిఖితపూడిలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధురి

**నరసాపురం రూరల్:** వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్బీచర్ల పీహెచ్‌సీ డాక్టర్ మావూరి మాధురి అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నరసాపురం మండలం లిఖితపూడి గ్రామ సచివాలయం పరిధిలోని 182 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులకు బీపీ, సుగర్ పరీక్షలు చేసి మందులు అందించారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ సుమిత్ర, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న కుమార్, హెల్త్ అసిస్టెంట్ భాస్కరమూర్తి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## కాలువల్లో నీటి ప్రవాహానికి తూడు అడ్డంకి



కొప్పర్రులో మొగల్తూరు డ్రెయిన్‌లో పెరిగిన తూడు

**నరసాపురం రూరల్:** ప్రధాన కాలువలకు నీరు విడుదల చేయడంతో రైతులు సాగుకు ఉపక్రమించడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని పలు పంట, మురుగు నీటి కాలువలో ఏపుగా పెరిగిన తూడు తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా తయారవుతాయని కొప్పర్రుకు చెందిన రైతులు చినమిల్లి వీరబాబు, రావి రామారావు, బద్ద రామ్మోహనరావు, వడ్లపాటి సూర్యారావు, మానుకొండ సామ్యేలు తదితరులు వాపోతున్నారు. ప్రధాన కాలువలకు ఆనుకుని ఉన్న పంట కాలువల్లో తూడును తొలగించకపోవడంతో సార్వా సాగుకు నీరు శివారు ప్రాంతాలకు నీరు అందడం జాప్యం అవుతుందని రైతులు వాపోతున్నారు. తక్షణమే పంట కాలువల్లో ఏపుగా పెరిగిన తూడును తొలగించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తూడు తొలగించి శివారు ప్రాంత రైతులకు సాగు నీరు అందిస్తేనే సకాలంలో నాట్లు పడతాయని రైతులు పేర్కొంటున్నారు.

## నేడు 'ఆదర్శ క్లబ్' ప్రమాణ స్వీకారం

**ఆకివీడు:** స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో లయన్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆదర్శ క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాసరావు చెప్పారు. లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారిగా ఎంవీఎస్ నాగమణి, సంయుక్త కార్యదర్శిగా ఎస్వీజీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, జితేంద్రబాబు, ఇతర కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామెర్ల శాంతి, సీహెచ్ కృష్ణంరాజు, గట్టిం మాణిక్యాలరావు, డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు హాజరవుతారన్నారు. లయన్స్ ప్రతినిధులు పల్లి రంగారెడ్డి, నేరెళ్ల రామ చెంచయ్య, గొంట్లా కృష్ణ, షరీఫ్, కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువులకు జోరుగా వ్యాక్సినేషన్



కనకాయలంకలో గేదెలకు గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ పోరెడ్డి చంద్రశేకర్‌రెడ్డి

**యలమంచిలి:** వేసవి అనంతరం వర్షాకాలం ప్రారంభ సమయంలో ఏర్పడే వాతావరణ మార్పు వల్ల పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల్లో గాలికుంటు ప్రాణాంతకమైనది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో పశు వైద్య శాఖ సిబ్బంది గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ వ్యాధి సోకితే పశువు ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి ప్రభావం ఎక్కువైతే పశువు మరణించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పశువులకు ప్రాణాపాయం రాకుండా ముందస్తుగానే ఈ వ్యాక్సిన్ వేయించాలని పశువుల వైద్యులు కోరుతున్నారు.

**ప్రణాళిక బద్ధంగా వ్యాక్సిన్**

గాలికుంటు వ్యాధి నుంచి పశువులను రక్షించేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేయిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా మే 25న ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం పూట పశు వైద్యులు, గ్రామ పశు సహాయకులు, గోపాలమిత్ర పశువుల కొట్టాల వద్దకు వెళ్లి ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు. పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు పర్యవేక్షణలో పశు సిబ్బంది ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి పశువుకు ఈ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా గ్రామ పశు సహాయకులు రైతులకు సమాచారం ఇస్తున్నారు. ఆ సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ పశువులకు ఈ వ్యాక్సిన్ వేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పాలకొల్లు డివిజన్‌లో..**

పాలకొల్లు డివిజన్‌లోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో 4,908 ఆవులు, 14,033 గేదెలు కలిపి 18,941 పశువులు ఉన్నాయి. గత నెల 25 ప్రారంభించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఇంత వరకు 9,085 పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుంది. ఈ లోపు నూరు శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేస్తామని పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు చెప్పారు.

#### ప్రతి పశువుకూ వ్యాక్సిన్ వేయించాలి



వ్యవసాయం చేసే రైతులు అదనపు ఆదాయం కోసం పశువులను పెంచుతుంటారు. వీరితోపాటు కేవలం పాడి రైతులు కూడా మన డివిజన్‌లో అధికంగా ఉన్నారు. పశువులకు ఏ కష్టం వచ్చినా రైతులు అల్లాడుతుంటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితంగా వేస్తున్న వ్యాక్సిన్‌ను రైతులంతా తమ పశువులకు వేయించాలి.

– డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు, పాలకొల్లు ప్రాంతీయ పశు వైద్య సహాయ సంచాలకులు

## వేడుకగా కోదండరాముడి కల్యాణం



రాయికుదురు గుడాలవారి వీధిలో సీతా సమేత కోదండరాముడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో సీతా సమేత కోదండరాముడు

**వీరవాసరం:** రాయికుదురు గుడాల వారి వీధిలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం వార్షిక మహోత్సవం శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, శ్రీ స్వామివార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. గ్రామ పెద్ద గుడాల సత్యనారాయణ దంపతులతో అర్చకస్వామి నారాయణం శ్రీనివాస దీక్షితుల బ్రహ్మత్వంలో సీతా సమేత కోదండ రామస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో బూరి, పులిహోర, నవకాయ పిండి వంటలతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గుడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

### ఆధ్యాత్మిక భావనతో జీవనం సాగించాలి



పాలకొల్లు హోదు యరుషలాయిమ్ కమ్యూనిటీ ఆవరణలో ఆటలాడుకుంటున్న చిన్నారులు

**పాలకొల్లు అర్బన్:** పట్టణ శివారు బోళ్ల వారితోటలోని హోదు యరుషలాయిమ్ కమ్యూనిటీ ఆవరణలో చిన్నారులకు ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణలో నిర్వహిస్తున్నారు. మూడున్నర దశాబ్దాలుగా చిన్నారులకు ఆధ్యాత్మిక శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ ఆఫ్ జుడాయిక్ స్టడీస్, ట్రెడిషనల్ ఆర్గనైజేషన్ ఒహెల్ హ సింహా సీనియర్ వలంటీర్ ఎస్.నిత్యజీవన్ శనివారం తెలిపారు. ఈ ఏడాది శిక్షణ తరగతులకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది పాల్గొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం ఆవశ్యత తదితర అంశాలను చిన్నారులకు బోధిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ప్రాచీన సంప్రదాయాలను, విన్నూత్నమైన ఆటలలో అవగాహన కల్పించడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. సోమవారం శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి సీనియర్ వాలంటీర్ ఆకుల రూపాదేవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.